క్లుప్తంగా

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి



నంజంపేటలో ప్రైవేటు కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి

సోమల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, వైఎస్సార్ సీపీని మండలంలో మరింత పటిష్టం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని నంజంపేటలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరెడ్డి, పీసీ కమిటీ చైర్మన్ రస్నా, వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు ఇంతియాజ్, ఖయ్యూం, మహమ్మదాలీ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీపీ

రామకుప్పం: పంచాయతీ పరిధిలోని హరిజన కోట గ్రామంలో దళితులకు శ్మశానవాటిక ఏర్పాటు కోసం స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ, ఎంపీపీ సుబ్రమణ్యం గురువారం స్థలాన్ని పరిశీలించారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను నేతలు కోరారు. దీంతో స్థానిక సర్పంచ్, ఎంపీపీ శ్మశాన వాటిక కోసం స్థల పరిశీలన చేశారు. శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒకరికి గాయాలు

బైరెడ్డిపల్లె: కర్నాటక రాష్ట్రం ముళబాగళ్‌కు చెందిన జమీల్‌ఖాన్(35) విరూపాక్షపురంలో పక్షవాతం మందు సేవించి, ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పి పడింది. దీంతో జమీల్‌ఖాన్‌కు తీవ్ర గాయాలు కావడంతో సచివాలయ మహిళా పోలీస్ ద్రాక్షాయణి బైరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే వేటు



మద్యం షాపును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

రొంపిచెర్ల: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది నిబంధనలు అతిక్రమిస్తే వేటు తప్పదని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి హెచ్చరించారు. ఆయన గురువారం రొంపిచెర్లలో మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది ఏదైనా పొరబాటు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సిబ్బందిపై ఆరోపణలు వస్తే వేటు ఖాయమన్నారు. స్టాక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజ, లోకనాథం, సూపర్‌వైజర్లు సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జెడ్పీ అతిథి భవనం తనిఖీ



అతిథి భవనాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో నూతనంగా నిర్మిస్తున్న జెడ్పీ అతిథి భవనాన్ని గురువారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు భవనాన్ని సందర్శించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, నాయకులు సాకత్‌అలీ, గోవిందరెడ్డి, దామోదర్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

27న బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ నక్కపల్లెలో నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 27వ తేదీన విగ్రహప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ గ్రామస్థులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న గంగపూజ, గణపతి పూజ, హోమాలు జరపనున్నట్టు పేర్కొన్నారు. 27న విగ్రహ ప్రాణప్రతిష్ట జరుగుతుందన్నారు.

ఫేషియల్ హాజరు తప్పనిసరి

రొంపిచెర్ల: ప్రభుత్వ ఉద్యోగులందరూ ఫేషియల్ యాప్‌లో హాజరు నమోదు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ రాజేంద్ర తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి ఫేషియల్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉందన్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల లోపు , సాయంత్రం 5 గంటలకు తప్పని సరిగా హాజరు వేసుకోవాలన్నారు. ఫేషియల్ యాప్‌లో హాజరు వేయకపోతే ఆ రోజు జీతం నిలిపి వేస్తామని చెప్పారు. ఉద్యోగులు పని చేస్తున్న చోట మాత్రమే హాజరు వేసుకోవాలన్నారు.

సదుం: భాస్కర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ



సదుం: కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



సమస్యల పరిష్కారం సంతోషదాయకం



సదుం: మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: పల్లెబాట కార్యక్రమంలో గ్రామస్తులందరూ ఒకటిగా కలుసుకుని, వారి సమస్యలను వారే పరిష్కరించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రాతివారిపల్లె, సదుం, తాటిగుంటపాళెం, రెడ్డివారిపల్లె, కంభంవారిపల్లె పంచాయతీ పరిధిలోని 24 గ్రామాల్లో ఆయన గురువారం పల్లెబాట నిర్వహించారు. సమస్యలు ఏవైనా మిగిలి ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తానని ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. నిర్మాణంలో ఉన్న మూడు ప్రాజెక్టుల పూర్తయితే సాగు, తాగునీటికి ఇబ్బందులు తొలుగుతాయని చెప్పారు. నియోజకవర్గంలోని రోడ్లు, నిర్మించిన కాలువలకు ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నట్టు చెప్పారు. పుట్టావారిపల్లె, భట్టువారిపల్లెలో రూ.8.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు, సదుంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, కంభంవారిపల్లెలో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. తాటిగుంటపాళెంలో దివంగత పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. గాండ్లపల్లెలో డ్రాగన్ ఫ్రూట్ సాగును ఆయన పరిశీలించారు. గొడ్లవారిపల్లె సమీపంలోని మదరసా విద్యార్థులతో ముచ్చటించారు.

ముగిసిన పల్లెబాట

మండలంలో నాలుగు రోజుల పాటు 136 గ్రామాల్లో నిర్వహించిన మంత్రి పల్లెబాట కార్యక్రమం గురువారంతో ముగిసింది. 13 అంగన్‌వాడీ, ఐదు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, నాలుగు ఆర్బీకేలు, నాలుగు సచివాలయాలు, ఒక బీసీఎంయూ కేంద్ర భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, రంగయ్య, టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, సర్పంచ్‌లు కళావతి, ఎల్లప్ప, ఉషారాణి, హనుమంతరెడ్డి, రెడ్డిదీప, ఎంపీటీసీ సభ్యులు శ్రీలత, ఆనంద, విజయలక్ష్మి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, నాయకులు మనోహరరెడ్డి, సయ్యద్‌బాషా, పుత్రాజు, దాము, భాస్కర్, గౌరీ రెడ్డి, గిరిధర్ రెడ్డి, వాసు, దేవేంద్రరెడ్డి, రామచంద్ర య్య, హరినాథరెడ్డి, శివారెడ్డి, మహేష్, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు కిట్లు పంపిణీ

సదుం: అంగన్‌వాడీ చిన్నారులు, తల్లులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులు మీదుగా హైజిన్ హ్యాబిట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. భట్టువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కిట్ల పంపిణీని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లోని సుమారు 40 వేల మంది చిన్నారులకు అపోలో సంస్థల ఆధ్వర్యంలో కిట్లను పంపిణీ చేస్తామని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. చేతుల అపరిశుభ్రతతో చిన్నారుల వ్యాధుల బారిన పడుతున్నారని, దీనిని నివారించేందుకు, చేతులు శుభ్రం చేసుకునేందుకు కిట్లు ఉపయోగపడుతాయని ఆమె చెప్పారు. వీటి వినియోగంపై త్వరలోనే అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీడీపీఓ మాధవీలత

బైరెడ్డిపల్లె: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని సీడీపీఓ మాధవీలత హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. గర్భిణులకు ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఇటీవల మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలపై ఫిర్యాదులు వచ్చాయని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యారద తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ



సిమెంట్ బెంచీల ప్రారంభంలో సీఐ ఆశీర్వాదం

పులిచెర్ల(కల్లూరు): గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలిలో ప్రయాణికులు కూర్చోవడానికి అనువుగా విశ్రాంత ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రెడ్డి సిమెంట్ బెంచ్‌లను వితరణ చేశారు. కూడలిలో ఏర్పాటు చేసిన బెంచీలను స్థానిక సీఐ ఆశీర్వాదం గురువారం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ కూడలి కావడంతో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి ఉందన్నారు. వారికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు రామ్మోహన్‌రెడ్డి ఎనిమిది సిమెంట్ బెంచీలను ఉచితంగా అందజేశారని చెప్పారు. దీంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉందని తెలిపారు. ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి, దాత రామ్మోహన్‌రెడ్డి, నరశింహులు శెట్టి పాల్గొన్నారు.

'అపూర్వ' కలయిక



విశ్రాంత ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సోమల: మండలంలోని కందూరు ఉన్నత పాఠశాలలో 1981–82వ సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనాటి తీపి గుర్తులను నేమరేసుకుంటూ ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా నాడు విద్య నేర్పిన గురువులు చంద్రమ్మ, విజయకుమారి, మునిరెడ్డి, పాపిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం హరినారాయణ, పూర్వ విద్యార్థులు నాగరాజ, చంద్రశేఖర్, భారతి, శ్రీనివాసులు రెడ్డి, లోకనాథరెడ్డి, జయప్రకాష్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మేఘ స్వరూప్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ గురువారం తనిఖీ చేశారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ఆస్పత్రిలోని సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ముఖ్యంగా కోవిడ్ రోగులకు బెడ్లు, ఆక్సిజన్ సౌకర్యాలపై ఆస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ హరగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌ఎంఓ డాక్టర్ మమతారాణి, వైద్యులు ఉన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో చంద్ర భేటీ

పలమనేరు: మండలానికి చెందిన ఎస్సీ సంఘం నాయకుడు చంద్ర గురువారం విజయవాడలోని ఎస్సీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలిశారు. ఆ సందర్భంగా పలమనేరు మండలంలోని ఎస్సీల సమస్యలను వివరించినట్టు చంద్ర తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపంజాణి: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు హెచ్‌సీ లీలా మోహన్ తెలిపారు. మండలంలోని కొళత్తూరు పంచాయతీ చదళ్లవారిపల్లెకు చెందిన చంద్రప్ప కుమారుడు రాజశేఖర్(30) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతని ఇంటిపై దాడి చేశారు. ఆ సమయంలో అతడి ఇంట్లో 30 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు ఉండగా గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు హెచ్‌సీ తెలిపారు.

వివేకానందుడి మార్గం అనుసరణీయం



పలమనేరు: మాట్లాడుతున్న తులసీనాథంనాయుడు

పలమనేరు: వివేకానందస్వామి మార్గం అనుసరణీయమని, నేటి యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. స్థానిక కళామందిరంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వివేకానంద చెప్పిన మాటలను మనం ఎల్లవేళలా మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే శ్రీకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో వివేకానంద స్వామి జయంతి నిర్వహించారు. హేమంత్, ప్రభాకర్‌రాజు, పూసల రవి, నాగరాజు, తాతయ్య, గురుమూర్తి, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, నీలిమ, పుష్ప పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

పుంగనూరు: పట్టణంలో స్వామి వివేకానందుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పలు ప్రాంతాల్లో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సేకరించిన రక్తాన్ని ఆస్పత్రులకు పంపుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వివేకానందుని బోధనలు చదివి, ఆయన బాటలో నడవాలని సూచించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జయకృష్ణ, కుమార్, హరినాథరెడ్డి, గిరి పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

చౌడేపల్లె: యువత వివేకానందస్వామిని ఆదర్శంగా తీసుకుని, ఉన్నతస్థాయికి ఎదగాలని నరేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సురేంద్రబాబు కొనియాడారు. గురువారం చౌడేపల్లె బస్టాండ్‌లో వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యువత దేశానికి మహోన్నతమైన శక్తిగా భావించి, సమాజంలో ఆదర్శంగా ఎదగాలని సూచించారు. చిన్నతనం నుంచే దేశభక్తితోపాటు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం వివేకానంద స్వామి చరిత్ర సూక్తుల సందేశం కరదీపికలను ఆవిష్కరించి, పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధులకు కరదీపికలను అందజేశారు. పలుసేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రదీప్‌రాజు, నరేష్, వెంకటరమణ, చంద్ర, శివ, రెడ్డెప్ప, వాసు, హరిప్రసాద్, వెంకటరమణ, గణేష్, దేవా, మణి, శీన తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు: రక్తదానం చేస్తున్న యువజన సంఘం సభ్యులు



చౌడేపల్లె: కరదీపికను ఆవిష్కరిస్తున్న సురేంద్ర బాబు, ప్రదీప్‌రాజు తదితరులు

కురుడుమలై వినాయకస్వామి సేవలో జెడ్పీ చైర్మన్



వినాయకస్వామిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్, కుటుంబ సభ్యులు

వి.కోట: కర్ణాటక రాష్ట్రంలోని కురుడుమలై దేవస్థానంలో ఉన్న వినాయకస్వామివారిని గురువారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆయన సతీమణి భాగ్యమ్మ, కుమారుడు నరేంద్ర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటక రాష్ట్రంలో ఉన్న కురుడుమలై వినాయకస్వామి అత్యంత శక్తివంతమైన, కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందారన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వరి

పుంగనూరు: మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి సూచించారు. గురువారం కార్యాలయంలో ఎంపీడీఓ రాజేశ్వరితో కలసి హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 12 కాలనీలు ఏర్పాటు చేసి, అందులో 3,386 మందికి గృహాలు మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు 60 శాతం పనులు జరిగాయని చెప్పారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తక్షణమే తమ పరిధిలోని గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలన్నారు. కాలనీల నిర్మాణానికి ఇసుక, సిమెంట్ పంపిణీ చేస్తున్నామన్నారు. కాలనీల్లో విద్యుత్ వసతితోపాటు పైపులైన్లు వేసి నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. డీఈఈ మధుబాబు, హౌసింగ్ ఏఈ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

శాంతిపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీపరమహంస యోగానంద పాఠశాల, దొంకుమాకనపల్లెలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పరమహంస స్కూలులో ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో గాలి పటాలు ఎగురవేసి, పొంగళ్లు వండి పూజలు చేశారు. దొంకుమాకనపల్లెలో గ్రేసీ మేరీ చారిటబుల్ ట్రస్టు, వైఎస్సార్ సీపీ యువత ఆధ్వర్యంలో ముగ్గులు, డ్యాన్స్‌లు, ఉట్టికొట్టే సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెంగమరాజు, వైస్ సర్పంచ్ ఎండీ బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు శంకర్, ట్రస్టు నిర్వాహకులు గ్రేసీ, ఆరోగ్యరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి జయంతి



త్యాగరాజస్వామి జయంతి వేడుకల్లో నాయకులు

పుంగనూరు: పట్టణంలో త్యాగరాజస్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు హేమంత్‌కుమార్, సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత హాజరై త్యాగరాజస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ తమ సంఘానికి ఎంపీ మిథున్‌రెడ్డి రూ.50 వేలు విరాళం ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జయరామిరెడ్డి, అమరేంద్ర, జయకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకుడు రాజు, గాండ్ల సంఘ నాయకుడు కుమార్, నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు రమణ, చంద్రన్న, లోకేష్, ఆంజన్న, వెంకట్రమణ, రాజశేఖర్, అమ్ములు , రాజన్న, శేఖర్, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సహకారంతోనే మైనారిటీల అభ్యున్నతి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రొంపిచెర్ల: పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతోనే మైనారిటీల అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీంఖాన్ అన్నారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రొంపిచెర్ల మండలంలో రూ.2 కోట్లతో మూడు షాదీమహళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. రొంపిచెర్ల మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసి, తొలి చైర్మన్‌గా మైనారిటీ నాయకుడు సలీంబాషాకు ఇచ్చారన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడైనా మైనారిటీలకు పదవులు ఇచ్చిందా? అని ప్రశ్నించారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మైనారిటీల్లో చిచ్చురేపే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డిపై టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తే నాలుక కోస్తామని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు చల్లాబాబు యువతను రెచ్చగొడుతూ చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. మండలంలోని బయట గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలను రప్పించి దాడి చేయించారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీంబాషా, సర్పంచ్ అన్సర్‌బాషా, కరీముల్లా, సూర్య నారాయణ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సైపుల్లాఖాన్, అబుబక్కర్, బావాజాన్, పరంధామయ్య నాయుడు, హరినాథ్, సుబ్రమణ్యం, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



వి.కోట: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్



పలమనేరు: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు



రామకుప్పం: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కురబ సంఘం నేతలు

పలమనేరు: నియోజకవర్గంలోని పలు మండలాల్లో వివిధ సంఘాలు, నాయకులు ముద్రించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. పలమనేరులోని పీజేసీ కల్యాణమండపంలో గురువారం బలిజ అభ్యుదయ సేవా సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం నేతలు సుధాకర్, బాబు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కనకదాస క్యాలెండర్..

రామకుప్పం: స్థానిక సుబ్రమణ్యస్వామి దేవాలయ ఆవరణలో గురువారం కురబ సంఘం నేతలు నూతన సంవత్సర కనకదాస క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు చలపతి, వేణుగోపాల్‌గౌడ్, మాజీసర్పంచ్ గోవిందప్ప పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్లు..

వి.కోట : మండలంలోని పి.కొత్తూరులో ఉన్న జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో రామకుప్పం మండలం పంద్యాలమడుగు వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్రించిన పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్లను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. మొదట నాయకులు జెడ్పీ చైర్మన్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పంచాయతీ కన్వీనర్ శ్రీనివాస్, నేతలు భాస్కర్, నాగప్ప, సెల్వరాజ్, గణేష్ పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

రొంపిచెర్ల: కారుణ్య నియామక పత్రాలను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి గురువారం లబ్ధిదారులకు అందజేశారు. రొంపిచెర్ల పంచాయతీ హైస్కూల్ వీధికి చెందిన ఖాదర్‌బాషా పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుని భార్య అలీయా ఖానం తనని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రొంపిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పించారు. దీంతో ఆమె ఎంపీపీ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అలాగే బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ మేళ్లయ్యగారిపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న సురేంద్రరెడ్డికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.లక్ష నగదు విరాళంగా అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, ఎంపీడీఓ రాజేంద్ర పాల్గొన్నారు.

పొగమంచుతో ఇక్కట్లు

బైరెడ్డిపల్లె: మండలంలో గురువారం విపరీతమైన మంచు కురిసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 9.30 గంటలైనా మంచు వీడక పోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. రహదారి ఏమాత్రం కనిపించక పోవడంతో వాహనచోదకులు ఎక్కడికక్కడే తమ వాహనాలను ఆపివేయాల్సి వచ్చింది.